క్లుప్తంగా

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ



వీపనగండ్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్న చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆర్‌బీఎస్‌కే వైద్యులు హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మొదటి అంగన్‌వాడీ సెంటర్‌లోని చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. తక్కువ బరువు ఉన్న పిల్లలను గుర్తించి పౌష్టికాహారంతో పాటు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన అంగన్‌వాడీ టీచర్‌కు సూచించారు. కార్యక్రమంలో వైద్య బృందంతోపాటు అంగన్‌వాడీ టీచర్ మహేశ్వరి, హెల్పర్ లచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణపై దృష్టి సారించండి



అమరచింత: మండలంలోని ఆయా గ్రామాల్లో రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలను సంరక్షించేందుకు దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. చెట్టుచెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొంకన్‌వానిపల్లి గ్రామంలోని నర్సరీని సందర్శించి రహదారి పక్కన నాటిన మొక్కలకు నీటిని అందించారు. ఈమేరకు మొక్కల సంరక్షణ కోసం తీసుకుంటున్న జాగ్రత్తల గురించి పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా నర్సరీలో ఎలాంటి మొక్కలు పెంచుతున్నామనే సమాచారం తెలుసుకునే విధంగా పలకలపై రాసి ఉంచాలన్నారు.

ఆర్థికసాయం అందజేత



కొత్తకోట: పట్టణ కేంద్రంలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న వడ్డెవాట గ్రామానికి చెందిన సురేష్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యానికి పెద్ద మొత్తంలో ఖర్చవుతుండటంతో పట్టణంలోని బైక్‌మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.31,500పోగు చేశారు. నగదులను శుక్రవారం సురేష్‌కు అసోసియేషన్ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో బైక్ మెకానిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మేఘవర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షులు ఎండీ రఫీ తదితరులు ఉన్నారు.

వైభవంగా రేణుకాచార్యుల జయంత్యుత్సవాలు



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారు దత్తకోటి లింగేశ్వరస్వామి ఆలయంలో వీరశైవ మత స్థాపకుడు ఆదిజగద్గురు రేణుకాచార్యుల జయంత్యుత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు రేణుకాచార్యుల చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. వీరశైవ మత స్థాపనకు లింగం నుంచి రేణుకాచార్యులు ఉద్భవించి శివశక్తిని ప్రచారం చేశారని, ఆయన జయంతిని ప్రతి వీరశైవ కులస్తుడు విధిగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మహేశ్వర్, శేఖర్, విశ్వనాథ్, జగదీశ్, అర్చకులు జగదీశ్‌స్వామి, అనిల్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మొక్కను బతికించాలి

కొత్తకోట రూరల్: ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని.. హరితహారంలో నాటిన ప్రతి మొక్కకు నీరందించి బతికించాలని ఎంపీఓ శ్రీరాంరెడ్డి సూచించారు. చెట్టు చెట్టు నీరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెద్దమందడి పల్లె ప్రకృతివనంలో ఉన్న మొక్కలకు నీరు పోసి మాట్లాడారు. ప్రతి గ్రామంలోని పల్లె ప్రకృతివనంలో మొక్కలు ఎండిపోకుండా ఉదయం, సాయంత్రం నీరు పట్టాలన్నారు. నర్సరీలో ఉండే మొక్కలకు సైతం నీరందించాలని కోరారు.

ముళ్లపొదల తొలగింపు

చిన్నంబావి: మంత్రి జూపల్లి కృష్ణారావు స్వగ్రామం పెద్దదగడలో రెండు దశాబ్దాల కిందట అప్పటి ప్రభుత్వం పేదలకు కేటాయించిన ప్లాట్లలో ఇళ్లు నిర్మించకపోవడంతో ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. ప్రస్తుతం ఇంటి నిర్మాణానికి అడ్డుగా ఉన్నాయని గ్రామస్తులు సమస్యను మంత్రి తనయుడు జూపల్లి అరుణ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి సొంత ఖర్చులతో ముళ్లపొదలు తొలగించి శుభ్రం చేయించేందుకు ముందుకొచ్చారు. శుక్రవారం మాజీ సర్పంచ్ సురేందర్‌సింగ్ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో వెంకటస్వామి, బాలగౌడు, వెంకటేష్, నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దంతనూరును వణికిస్తున్న జ్వరాలు

- నరకం అనుభవిస్తున్న గ్రామస్తులు
- కీళ్లు, కాళ్ల నొప్పులతో ఇబ్బందులు



వ్యాధి బారినపడిన దంతనూరు గ్రామస్తులు



మదనాపురం: మండలంలోని దంతనూరు గ్రామస్తులు వారం రోజులుగా అంతుచిక్కని ఓ వ్యాధితో బాధపడుతున్నారు. ఈ వ్యాధి ఊరంతా చుట్టేసింది. మొదట్లో కాళ్ల, కీళ్ల నొప్పులతో ప్రారంభమైన ఈ వ్యాధి లక్షణాలు దేహమంతా వ్యాపిస్తుంది. జ్వర బాధితులు నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. మొదట్లో చికెన్‌గున్యా లక్షణాలు ఉన్నాయని స్థానిక వైద్య అధికారులు క్యాంపు ఏర్పాటు చేసి మందులు అందించారు. మెడిసిన్ వాడిన కొన్ని రోజులు మాత్రమే తగ్గింది. తర్వాత తిరిగి బాధితుల సంఖ్య పెరిగింది.

ఇంటిల్లిపాదికీ..

ఇంట్లో ఒక్కరు, ఇద్దరితో ప్రారంభమైన ఈ రోగం క్రమంగా అందరికీ అంటుకుంటుంది. వ్యాధి బారిన పడినవారు కదలలేని స్థితిలో మంచాలకే పరితమయ్యారు. ఆర్థికంగా ఉన్న వారు ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. కానీ పేదలు మాత్రం నొప్పులతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య క్యాంపులో ఇచ్చిన మందులను వాడి వేసుకొని కాలం గడుపుతున్నారు. 4 వేల జనాభా ఉన్న ఈ గ్రామంలో ఇప్పటికే దాదాపు 50 మందికి పైగా మంచాన పడ్డారు.

అప్రమత్తమైన అధికారులు

ఊరంతా రోగం రోగం వచ్చిందని గుర్తించిన అధికారులు 13వ తేదీ రోజు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు. 51 మంది రోగులకు సంబంధించిన రక్త నమూనాలు సేకరించారు. గ్రామంలో ఏ క్షణం ఏ వార్త వినాల్సి వస్తుందని ప్రతి ఒక్కరూ భయపడుతున్నారు. ఈ అంతుచిక్కని వ్యాధిపై జిల్లా వైద్య ఉన్నతాధికారులు ప్రత్యేక దష్టి పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కాళ్ల నొప్పులతో..



నేను మూడు రోజుల నుంచి కాళ్ల నొప్పులతో ఇబ్బంది పడుతున్నాను. జ్వరం వచ్చింది. ఇలాంటి నొప్పులు ఎప్పుడూ చూడలేదు. నరకయాత్ర అనుభవిస్తున్నాను. ఏం చేయాలో దిక్కుతోచక భయం భయంగా గడుపుతున్నాం. అధికారులు స్పందించి ఈ అంతుచిక్కని వ్యాధిని నయం చేసి ఊరిని కాపాడాలి.

– రాజు, దంతనూరు

నడవలేని స్థితిలో..



నాకు కాళ్లు కీళ్లు నొప్పులతో జ్వరం వచ్చింది. నడవలేని స్థితిలో ఉన్నాను. తిందామంటే తినబుద్ధి కావడం లేదు. ఇంటి ముందు ఇంటి వెనక ప్రతి ఇంట్లో రోగులు ఉన్నారు. భయం భయంగా గడుపుతున్నాం. కీళ్ల వాపులు వస్తున్నాయి.

– అనిత, దంతనూరు

సూదులతో పొడిచినట్లు ఉంది



మోకాలు వాచి సూదులతో పొడిచినట్లు గుంజుతున్నాయి. జ్వరం వస్తే చాలు లేవలేని స్థితిలోకి వెళ్లిపోతున్నాం. కూలీ పనులు చేసుకొని బతికే మాకు ఇలాంటి రోగాలు రావడంతో దిక్కుతోచక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వ అధికారులు స్పందించి నయం చేయాలి.

– మధు, దంతనూరు

వైరల్ ఫివర్‌తోనే ఇబ్బంది



వైద్య క్యాంప్ ఏర్పాటు చేసి వ్యాధి లక్షణాలు గల 51 మందికి పరీక్షించి రక్త నమూనాలు తీసుకున్నాము. టైఫాయిడ్, మలేరియా, చికన్ గున్య, డెంగీ మరియు మొదలగు పరీక్షలు చేసాము. టైఫాయిడ్ కేసు లు మాత్రమే వచ్చాయి. భయపడాల్సిన అవసరం లేదు. వైరల్ ఫివర్‌గా గుర్తించాము. శనివారం గ్రామంలో వైద్య క్యాంపు ఏర్పాటు చేస్తున్నాము. అదుపులోకి వచ్చే వరకు అక్కడే ఉంటాము.

– డా. భవాని, మదనాపురం

నట్టల నివారణ మందులు వేయాలి



గోపాల్‌పేటలో మరణించిన గొర్రె పొట్టేలును పరిశీలిస్తున్న డాక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని పశువుల దవాఖానా ఆధ్వర్యంలో నట్టల నివారణ మందులు వేయాలని స్థానికులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఓ గొర్రె పొట్టేలు మరణించగా.. దానికి నట్టల మందులు సమయానికి వేయకపోవడం వల్ల మరణించిందని రైతులు ఆరోపించారు. గొర్రె పొట్టేలు తీసుకుని పశువుల దవాఖానా దగ్గరకి చేరుకుని డాక్టర్‌ను నిలదీశారు. గొర్రెలు ఎక్కువ సంఖ్యలో మరణించక ముందే చర్యలు తీసుకోవాలని కోరారు. పశువుల డాక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డిని వివరణ కోరగా.. తీసుకొచ్చిన గొర్రె పొట్టేలులో నట్టలు లేవని, పదిరోజుల క్రితం రైతు నట్టల మందు వేశాడని చెప్పారు. మేతలో ఏదైనా తేడా జరిగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. గతేడాది మే లో నట్టలమందులు వచ్చాయని, ప్రస్తుతం మందులు అందుబాటులో వివరించారు. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామని చెప్పారు.

అర్హులందరికి సంక్షేమ ఫలాలు అందాలి



నర్సింగాపురంలో కేంద్ర పథకాల అర్హులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న నాయకులు

మదనాపురం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు ప్రతి ఇంటికీ అందించేలా కార్యకర్తలు కృషి చేయాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు బిట్టి రాజశేఖర్‌యాదవ్ కోరారు. పల్లె పల్లెకు బీజేపీ, ఇంటింటికీ మోదీ సంక్షేమం అనే నినాదంతో శుక్రవారం నర్సింగాపురంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గురించి వివరించారు. అయుష్మాన్ భారత్, ఉజ్వల పథకం, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్‌నిధి, సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం గ్రామస్తులకు ఆన్‌లైన్ నమోదు చేసే కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో కావలి కురుమూర్తి, శరత్, మధు, ఆంజనేయులు, దేవేందర్, మహేష్, తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

'మూడు నెలల్లో కాంగ్రెస్ తట్ట మట్టి ఎత్తలేదు'

- అభివృద్ధిపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు
- బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మున్నూరు రవీందర్



మాట్లాడుతున్న మున్నూరు రవీందర్

వనపర్తి టౌన్: బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన రోడ్ల విస్తరణ తప్పితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడు నెలలు అవుతున్నా విస్తరణ పనులు ప్రారంభించి తట్ట మట్టి ఎత్తలేదని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మున్నూరు రవీందర్ మండిపడ్డారు. వనపర్తి అభివృద్ధిపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీగార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ చిన్నారెడ్డి వనపర్తి రోడ్ల విస్తరణ తీర్మానం జరిగినప్పుడు ఎమ్మెల్యేగా ఉన్నారని, ఆనాటి జీవో 210 ప్రకారం రోడ్ల విస్తరణలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని ఉందన్నారు. దీనిపై అధికారులను సంప్రదిస్తే ఎలాంటి బడ్జెట్ అలోకేషన్ చేయలేదని, తామేమి చేయలేమని చేతులెత్తేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలో మూడు రోజులకొకసారి తాగునీరు రావడం లేదని, రానున్న ఎండకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ముందస్తున్న ప్రణాళికలు, చర్యలతో ప్రజలకు ఇబ్బందులు రానివ్వకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ, బీజేపీ జిల్లా అధికారి ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జ్ పెద్దిరాజు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న స్వరూప

కొత్తకోట రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలంటే సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉంటూ పుస్తకాలు ఎక్కువగా చదవాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగ కౌన్సిలర్ స్వరూప అన్నారు. శుక్రవారం మండలంలోని కానాయపల్లి సమీపంలో ఉన్న మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, పోక్సో చట్టం, మత్తు పదార్థాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ సమస్యలను టోల్‌ఫ్రీ నంబర్ 1098కు ఫోన్‌చేసి తెలియజేయాలన్నారు. బాలలతో పనులు చేయిస్తే చట్ట ప్రకారం శిక్ష పడుతుందని తెలిపారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి : కాంగ్రెస్

కొత్తకోట రూరల్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ఎంపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త, నాయకుడు పనిచేయాలని పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి బోయేజ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు మేస్త్రీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎన్నికైన బీసీసెల్ కార్యవర్గాన్ని శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా బోయేజ్ మాట్లాడుతూ.. 100 రోజుల్లో అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించి అభ్యర్థి గెలుపునకు కష్టపడాలన్నారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ ఎంపీ స్థానాలను గెలిపించి సీఎం రేవంత్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జేసీబీ రాములుసాగర్, ధన్వాడ బాలస్వామి, మిషేక్, సంద వెంకటేష్, సాయిలుయాదవ్, నవీన్‌కుమార్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధికారి లక్ష్మీబాయి

ఆత్మకూర్: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి లక్ష్మీబాయి, సీడీపీఓ భారతిరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్లు శ్రీలత, నర్మద, సబిత, అంగన్‌వాడీ టీచర్లు, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలం రాజపేట శివారులోని రెండు పడక గదుల ఇళ్ల వద్ద నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు రమేష్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణానికిగాను రైతు రాములు వద్ద 8 గుంటల భూమిని సేకరించి దానికి ప్రత్యామ్నాయంగా 13 గుంటల ప్రభుత్వ భూమిని పట్టా చేసి ఇస్తామని చెప్పిన అధికారులు నేటికీ పట్టా చేయడం లేదన్నారు. దీంతో సెప్టిక్ ట్యాంక్, ఇళ్లకు కొళాయి కనెక్షన్లు ఇవ్వకుండా అడ్డుపడుతున్నారని చెప్పారు. వీధిదీపాలు ఏర్పాటు చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే లబ్ధిదారులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

'ఉపాధి' ఎత్తివేసేందుకు కుట్ర

ఆత్మకూర్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని మోట్లంపల్లిలో ఉపాధిహామీ కూలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం ఉపాధిహామీ పథకానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపును కుదిస్తూ వస్తోందని.. పూర్తిగా ఎత్తివేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారని ఆరోపించారు. ప్రతి కూలీకి జాబ్‌కార్డు ఇవ్వాలని, 200 రోజుల పని కల్పించాలని, పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని, రోజుకు రూ.800 కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, ఉపాధి కూలీలు ఉన్నారు.

అంకితభావంతో వైద్యసేవలు అందించాలి

వీపనగండ్ల: ఇటీవల ఉద్యోగంలో చేరిన వైద్య సిబ్బంది అంకితాభావంతో పనిచేసినప్పుడే మంచి గుర్తింపు వస్తుందని కమ్యూనిటీ హెల్త్ సూపరింటెండెంట్ డా.రాజుకుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఇటీవల ఉద్యోగాలలో చేరిన స్టాఫ్‌నర్సులు, వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 30 పడకల ఆస్పత్రికి అవసరమైన వైద్య వసతులు, పరికరాలు సమకూర్చాలని ఉన్నతాధికారులకు నివేదించినట్లు ఆయన తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీపనగండ్ల: మండలంలోని తూంకుంట గ్రామ ఇసుక రీచ్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం వనపర్తి నుంచి వచ్చిన ప్రత్యేక బృందం అధికారులు అదుపులోకి తీసుకొని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వరలక్ష్మికి అప్పగించారు. పట్టుబడిన ట్రాక్టర్ అడిషనల్ కలెక్టర్ స్థాయి అధికారులకు అప్పగించినట్లు తహసీల్దార్ తెలిపారు.

బెల్టు షాపుపై దాడి

అమరచింత: చంద్రగఢ్ స్టేజీ వద్ద అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు షాప్‌పై పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి 10 లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సురేష్‌కుమార్ తెలిపారు. ఎన్నికల నియమావళి అమలులో భాగంగా గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండే విధంగా అధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 10 లీటర్ల మద్యం సీజ్ చేసి బెల్ట్ షాపు యజమాని నాగన్నపై కేసు నమోదు చేశామన్నారు.

కేశంపేటలో మద్యం..

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని కేశంపేటలో శుక్రవారం అక్రమంగా మద్యం అమ్ముతున్న నిజాముద్దీన్, మహమూద్ కిరాణం షాపుల్లో తనిఖీ చేసి రూ.23 వేల విలువ చేసే 24 లీటర్ల మద్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తిరుపతిరెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

పాన్‌గల్: విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందిన ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రేమద్దుల గ్రామానికి చెందిన ఆవుల సురేష్ ఎద్దులను గ్రామ సమీపంలోని తన వ్యవసాయ పొలానికి తీసుకెళ్లాడు. పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పశుగ్రాసం తింటూ విద్యుత్ వైర్లకు తగిలి విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందినది. దీని విలువ దాదాపుగా రూ.70 వేల వరకు ఉంటుందని రైతు పేర్కొన్నారు. తమ కళ్ల ముందే విద్యుత్ షాక్‌కు గురై ఎద్దు మృతిచెందడంతో రైతు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు. ప్రభుత్వ పరంగా సహాయం చేసి ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

దోమల నివారణకు చర్యలు



హౌజ్‌లోని నీటిని పారబోస్తున్న సిబ్బంది

పెబ్బేరు రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఇన్‌చార్జ్ మలేరియా నివారణ అధికారి శ్రీనివాస్‌జీ అన్నారు. డ్రై డే సందర్భంగా శుక్రవారం మండలంలోని యాపర్లలో ఆంటీ లార్వా టీమ్ సభ్యులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలకుండా గ్రామంలో వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి పరిసరాలలో పాత టైర్లు, సిమెంటు ట్యాంకులు, డ్రమ్ములు, ఎయిర్‌కూలర్లలో నీళ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉండకూడదన్నారు. కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి శివారెడ్డి, హెల్త్‌అసిస్టెంట్ గందం రాజు, శ్రీనివాసులు, ఏఎస్‌ఎం సరోజమ్మ, ఆశాకార్యకర్తలు సుమిత్ర, శాంతాకుమారి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు పనిచేద్దాం



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఖిల్లాఘనపురం: త్వరలో దేశవ్యాప్తంగా జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ అభ్యర్థి భరత్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని బీజేపీ వనపర్తి అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడు, యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మధు, జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి అధ్యక్షతన బీజేపీ ముఖ్యనాయకులు, పదాధికారుల సమావేశం నిర్వహించారు.

గ్రామస్థాయి నుంచి..

ప్రతి గ్రామంలో బూత్‌కమిటీల నుంచి నియోజకవర్గంలోని అన్ని కమిటీలు ముమ్మరంగా ప్రచారం నిర్వహించాలని అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని వెనికితండాలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు రవినాయక్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో రాంరెడ్డి, విక్రంరెడ్డి, శివశంకర్, చక్రవర్తిగౌడ్, సత్యనారాయణ, శాంతమ్మ, వెంకటరమణ, రాంచందర్, గోపాల్‌రెడ్డి, నరసింహ, మల్లేష్, పాండు, రాజు నాయక్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే



టీబీపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో కుష్ఠువ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే మండలంలో కొనసాగుతుంది. శుక్రవారం మండల కేంద్రంతో పాటు చిక్కేపల్లి, శాగాపూర్ గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే చేసి, టీబీపై అవగాహన కల్పించారు. శరీరంపై మొద్దుబారిన స్పర్శలేని మచ్చలు ఉంటే పరీక్షలు చేయించుకోవాలని, రెండు వారాలకు మించి దగ్గు, దగ్గినప్పుడు తెమడ, రక్తం పడటం, స్వల్పకాలంలో బరువు తగ్గడం, సాయంత్రం వేళల్లో రోజు విడిచి రోజు జ్వరం రావడం, రాత్రి వేళల్లో చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ లక్షణాలు ఉన్న వారు వైద్యాధికారిని సంప్రదించి తెమడ పరీక్షలు చేయించుకోవాలని వైద్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మదన్ గోపాల్, ఆశా కార్యకర్తలు పార్వతి, బీమమ్మ, కార్యదర్శులు పాల్గొన్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు మారినా.. బోర్డు మారలే



పాన్‌గల్ పీహెచ్‌సీలో అభివృద్ధి కమిటీ బోర్డు

పాన్‌గల్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో అభివృద్ధి కమిటీ బోర్డుపై పీహెచ్‌సీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మారిన, మరికొందరు ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగిసిన వారి పేర్లు ఇంకా బోర్డుపై అలానే కొనసాగుతున్నాయి. బోర్డులో స్థానిక ఎమ్మెల్యే, డీఎంహెచ్‌ఓ, తహసీల్దార్, ఎంపీడీఓ, మహిళ సమాఖ్య అధ్యక్షురాలు మారిన వారి పేర్లు తొలగించకపోవడం, సర్పంచుల పదవీకాలం ముగిసిన ఇంకా వారి పేర్లు ఉన్నాయి. పాత పేర్లు తొలగించకపోవడం, కొత్తగా వచ్చిన వారి పేర్లు బోర్డుపై ముద్రించకపోవడం పీహెచ్‌సీ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఇప్పటికైనా సంబంధిత పీహెచ్‌సీ అధికారులు స్పందించి వారి పేర్లను తొలగించి కొత్తవారి పేర్లను ముద్రించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జిల్లాకేంద్రంలో ఇఫ్తార్

వనపర్తిటౌన్: ముస్లింలు రంజాన్‌కు ముందు భక్తిశ్రద్ధలతో ఉపవాసం చేస్తే భగవంతుడికి చేరువ అవుతారని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి జిల్లాకేంద్రంలోని జామా మసీద్‌లో ముస్లింలకు ఇఫ్తార్‌విందు ఇచ్చారు. ఆరోగ్య పరిరక్షణకు ఇఫ్తార్ విందు దోహదం చేస్తుందని చెప్పారు. ఇఫ్తార్ ప్రజల మధ్య ఐక్యతకు చిహ్నమని పేర్కొన్నారు. అంతకుముందు మసీద్‌లో ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మతపెద్దలు, కాంగ్రెస్ నాయకలు ఎల్.సతీష్, పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ్‌చందర్, నాయకులు బ్రహ్మం, రవి పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com